వైభవంగా సుప్రభాత సేవోత్సవం

సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 18 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ప్రధానాలయంలో సుప్రభాత సేవోత్సవం అత్యంత వైభవంగా సాగింది. బుధవారం తెల్లవారుజామున ఆలయాన్ని తెరిచిన అర్చకులు 'కౌసల్యారామ పూర్వా సంధ్యాప్రవర్తతే' అంటూ సుప్రభాతం ఆలకించి స్వామివారిని మేల్కొలిపారు. తిరువారాధన చేపట్టి ఉదయం ఆరగింపు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం నిర్వహించి భక్తులకు నిజరూప దర్శనం కల్పించారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి గజ వాహనంపై వేంచేపు చేసి కల్యాణోత్సవ సేవ నిర్వహించారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వేంచేపు చేసి కల్యాణతంతు చేపట్టారు. లక్ష్మీసమేతుడైన నారసింహుడిని ఆరాధిస్తూ సుమారు గంటన్నరకు పైగా నిత్య తిరు కల్యాణ తంతు జరిపారు. స్వామివారి కల్యాణంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు దఫాలుగా బంగారు పుష్పాలతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. సాయంత్రం స్వామివారిని గరుడ వాహనం, అమ్మవారిని తిరుచ్చి వాహనంపై ఊరేగిస్తూ వెండి మొక్కు జోడు సేవలను నిర్వహించారు. ముఖ మండపంలో సువర్ణమూర్తులకు నక్షత్ర హారతినిస్తూ దర్బార్ సేవను అత్యంత వైభవంగా చేపట్టారు. పాతగుట్టలో స్వామివారికి నిత్యారాధనలు వైభవంగా సాగాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 8వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.13,48,904 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు వెల్లడించారు.

హుండీ ఆదాయం రూ.2,98,48,233

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి హుండీ ఆదాయం రెండున్నర కోట్లు దాటిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. బుధవారం కొండ కింద వ్రత మండపంలో 43 రోజుల హుండీని లెక్కించారు. 2,98,48,233 నగదు, 205 గ్రాముల మిశ్రమ బంగారం, 5 కిలోల 710 గ్రాముల మిశ్రమ వెండి వచ్చినట్లు వారు తెలిపారు. వీటితోపాటు అమెరికాకు చెందిన 1,261 డాలర్లు, 125 ఆస్ట్రేలియా డాలర్లు, 65 ఇంగ్లాండ్ పౌండ్స్, 210 యూఏఈ ధిరమ్స్, 739 నేపాల్ రూపీస్, 537 సౌదీ అరేబియా రియల్, 60 సింగపూర్ డాలర్స్, 3 ఖతర్ రియల్, 100 ఒమన్ బైస, 1000 శ్రీలంక రూపీస్, 60 కెనడా డాలర్స్, 125 యూరప్ యూరో, థాయిలాండ్‌కు చెందిన 20 భట్, రష్యాకు చెందిన 50 రూబెల్, ఒమన్‌కు చెందిన 1 రియల్, మలేషియాకు చెందిన 22 రింగిట్స్ హుండీకి చేరినట్లు వెల్లడించారు.

పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ హనుమంతు కె.జెండగే

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతు కె.జెండగే

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 18 : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి పురోగతి సాధించాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పురోగతిని సమీక్షించి పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు డీసీపీ లక్ష్మీనారాయణ, డీఆర్‌డీఓ నాగిరెడ్డి, జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి జైపాల్‌రెడ్డి, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్లు రవికిరణ్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, మధుసూదన్‌రెడ్డి, సంబంధిత కమిటీ అధికార, అనధికార సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాలలో భద్రతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలి : కలెక్టర్

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 18 : పాఠశాలలో పారిశుధ్యం, భద్రతపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని కలెక్టర్ హనుమంతు కె.జెండగే సూచించారు. మండలంలోని తూప్రాన్‌పేట సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల, జూనియర్ కళాశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పాఠాలు బోధించి వారిని ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి మెనూ గురించి అడిగారు. ఉత్తమ ఫలితాలు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కవిత, వైస్ ప్రిన్సిపాల్ సునీల, ఉపాధ్యాయులు విద్యావతి, మాధవి పాల్గొన్నారు.

భక్తిభావం అలవర్చుకోవాలి : ప్రభుత్వ విప్ ఐలయ్య

మహా గణపతికి పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 18 : మున్సిపాలిటీలో వి.యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహా గణపతిని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య బుధవారం దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు భక్తిభావాన్ని అలవర్చుకోవాలన్నారు. ఆధ్యాత్మికతను పెంపొందించుకోవడం వల్ల మానసిక ప్రశాంతత ఏర్పడుతుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో జీవించాలని గణనాథుడిని వేడుకున్నట్లు చెప్పారు. అనంతరం ఐలయ్యను యూత్ సభ్యులు సన్మానించారు. అలాగే పట్టణంలోని వివిధ గణపతి మండపాల వద్ద పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ గంధమల్ల అశోక్, మదర్ డెయిరీ డైరెక్టర్ బత్తుల నరేందర్‌రెడ్డి, సీనియర్ అడ్వకేట్ రావుల రవీందర్ రెడ్డి, నాయకులు, యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పలువురికి పరామర్శ

ఆలేరు టౌన్ : ఆలేరులో పలు కుటుంబాలను ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య బుధవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. జర్నలిస్టు ఎండీ జహంగీర్ సతీమణి గుండెపోటుతో చనిపోవడం బాధాకరమన్నారు. ధైర్యంగా ఉండాలని జహంగీర్‌కు సూచించారు.

తడి, పొడి చెత్తపై అవగాహన

భువనగిరి అర్బన్ : పట్టణంలోని పలు వార్డుల్లో బుధవారం మున్సిపల్ అధికారులు తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ శానిటరీ అధికారి ప్రసాద్ మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా వాహనాలకు అందించాలన్నారు. చెత్తను వీధుల్లో కాకుండా నిర్దేశించిన ప్రదేశాల్లోనే వేయాలన్నారు. ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిషేధించడంతోపాటు వీధుల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ రజిత, టౌన్ మిషన్ కో ఆర్డినేటర్ శ్రీమతి శ్యామల, కమ్యూనిటీ ఆర్గనైజర్ సువర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడికి యత్నం

భువనగిరి కలెక్టరేట్ : మానసిక దివ్యాంగురాలిపై ఓ వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. స్థానికులు గమనించి వెంబడించడంతో పారిపోయాడు. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. భువనగిరి మండలంలోని ఓ గ్రామానికి చెందిన 20 ఏండ్ల మానసిక దివ్యాంగురాలిని ఆమె ఇంటి పక్కనే ఉండే ఓ యువకుడు బుధవారం మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లాడు. తలుపు గడి పెట్టి లైంగికదాడికి ప్రయత్నించాడు. స్థానిక యువకుడొకరు తలుపు కొట్టగా.. నిందితుడు వెనుక డోరు నుంచి పారిపోయాడు. బాధిత కుటుంబ సభ్యులు భువనగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

రాజాపేట : మండలంలోని బూర్గుపల్లి గ్రామానికి చెందిన బొంత నర్సింహులు(40) అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. బొంత నర్సింహులు గ్రామంలో కూలి పని చేసుకొని జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య ఎనిమిదేండ్ల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. దీంతో మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. దానికితోడు అనారోగ్యానికి గురై మానసికంగా కుంగిపోయాడు. బుధవారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ ఉపేందర్‌యాదవ్ తెలిపారు.

ఉద్యోగిపై దాడికి పాల్పడిన తండ్రీకొడుకులపై కేసు నమోదు

చౌటుప్పల్ : విద్యుత్ శాఖ ఉద్యోగిపై దాడికి పాల్పడిన తండ్రి, కొడుకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. మున్సిపాలిటీలోని లక్కారంలో జూనియర్ లైన్‌మెన్ రామాంజనేయులు విద్యుత్ పాత బకాయి చెల్లించాలని గొడుగు యాదయ్య ఇంటికి వెళ్లాడు. అతను స్పందించకపోవడంతో లైన్‌మెన్ కరెంట్ కట్ చేశాడు. దీంతో కోపోద్రిక్తుడైన యాదయ్య, తన కొడుకు గణేశ్‌తో కలిసి ఉద్యోగిపై కర్రతో దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తెలుగు ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు

వలిగొండ : మండలంలోని లోతుకుంట మోడల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న తెలుగు ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రహీమున్నీసా బేగం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు బీఏ తెలుగు లిటరేచర్, బీఎడ్, టెట్, ఎంఏ తెలుగు బీఎడ్ టెట్ అర్హత కల్గి ఉండాలని పేర్కొన్నారు. ఔత్సాహికులైన అభ్యర్థులు 21వ తేదీలోపు లోతుకుంట మోడల్ స్కూల్లో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

నేడు ముసాయిదా ఓటర్ల జాబితాపై అవగాహన

యాదగిరిగుట్ట : ముసాయిదా ఓటర్ల జాబితాపై గురువారం అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నవీన్‌కుమారు ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ నెల 13న గ్రామ పంచాయతీ కార్యాలయంలో వార్డుల వారీగా ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించినట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

పద్మశాలీ చేనేత కార్మిక సంఘం పాలకవర్గం ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న పద్మశాలీ చేనేత కార్మిక సంఘం పాలకవర్గ సభ్యులు

భూదాన్ పోచంపల్లి, సెప్టెంబర్ 18 : పట్టణంలో పద్మశాలీ మహాజన సంఘం ఆధ్వర్యంలో ఎన్నికల కన్వీనర్ సీత శ్రీరాములు, అంకం మురళి బుధవారం పద్మశాలి చేనేత కార్మిక సంఘం నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎన్నికల్లో గెలుపొందిన వారికి ధ్రువపత్రాలు అందజేశారు. అధ్యక్షుడు అంకం పాండు, ఉపాధ్యక్షుడు భారత భూషణ్, ప్రధాన కార్యదర్శి బొమ్మ హరిశంకర్, సహాయ కార్యదర్శి బిట్ల గణేశ్, కోశాధికారి రుద్ర సూర్యప్రకాశ్, డైరెక్టర్లు కటకం శ్యాంసుందర్, కూరపాటి భాస్కర్, పొట్టబత్తిని వేణు, గుండేటి శివరాజ్, గుండు రాజేశ్వరి, గుర్రం హేమలత ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా చేనేత కార్మిక సంఘ అధ్యక్షుడు అంకం పాండు మాట్లాడుతూ చేనేత కార్మికుల సంక్షేమం కోసం శాయశక్తులా కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూస్తానని చెప్పారు. కార్యక్రమంలో టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, పోచంపల్లి అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్, మార్కండేశ్వర దేవాలయ చైర్మన్ సీత సత్యనారాయణ, చేనేత కార్మిక సంఘం మాజీ అధ్యక్షురాలు మెరుగు శశికళ, చేనేత జన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు చింతకింది రమేశ్, నాయకులు భారత బాలరత్నం, బోగ విష్ణు, ఏలె భిక్షపతి, రమేశ్, శ్రీనివాస్, యుగంధర్, రాము పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి సహకరిస్తా : ఎమ్మెల్యే వీరేశం


ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో ఎమ్మెల్యే వేముల వీరేశం

రామన్నపేట, సెప్టెంబర్ 18 : ఎన్నారంలో ఆలయ పునర్నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండలంలోని ఎన్నారం గ్రామంలో నిర్మించే ఆంజనేయస్వామి ఆలయ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. పాలకవర్గ సభ్యులు పార్టీలకతీతంగా భాగస్వాములై ఆలయ నిర్మాణ పనులు పూర్తి చేయాలన్నారు. దేవాదాయ శాఖ అధికారి వెంకట లక్ష్మి నూతన పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ చైర్మన్‌గా ఏనుగు దామోదర్‌రెడ్డి, సభ్యులుగా సింగారం నర్సింహ, లొడంగి సురేశ్, బండ మీది దివ్య, ఈరెల్లి యాదయ్య ప్రమాణం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ లక్ష్మీకాంతరావు, నాయకులు ప్రభాకర్, భాస్కర్‌రెడ్డి, విజయ్‌కుమార్, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య


బీబీనగర్ గురుకుల కళాశాలలో నిరసన ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయులు

బీబీనగర్, సెప్టెంబర్ 18 : గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర్ల యాదయ్య డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్, గురుకుల ఉపాధ్యాయుల జేఏసీ పిలుపు మేరకు మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయులు, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని, గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని, శాస్త్రీయమైన టైం టేబుల్‌ను సవరించాలని అన్నారు. 010 పద్దు కింద వేతనాలు చెల్లించాలని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ నియామకాలకు స్వస్తి పలుకాలని కోరారు. మెస్ చార్జీలు చెల్లించాలని, డిప్యూటీ వార్డెన్లను నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.సుధర్మారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వి.రమేశ్, సీహెచ్ ప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడపర్తి ఆగ చెరువును గోదావరి నీటితో నింపాలి


వినతిపత్రం ఇజేస్తున్న వడపర్తి గ్రామ రైతులు

భువనగిరి అర్బన్, సెప్టెంబర్ 18 : మండలంలోని వడపర్తి ఆగ చెరువును గోదావరి జలాలతో నింపాలని గ్రామస్తులు బుధవారం ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ మాట్లాడుతూ ఆగ చెరువులోకి కొండపోచమ్మ రిజర్వాయర్ ద్వారా గోదావరి జలాలు అందించాలన్నారు. వర్షాభావ పరిస్థితులతో చెరువులో చుక్క నీరు లేక అయకట్టు ప్రాంతం ఎడారిగా మారిందన్నారు. తుర్కపల్లి మండలంలోని పెద్దతండా, రుస్తాపురం చెరువులు నింపితే కాల్వ లేకుండానే వడపర్తి ఆగ చెరువును నింపుకోవచ్చని తెలిపారు. ఇరిగేషన్ అధికారులు పరిశీలించి చెరువు నింపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ పాండాల మైసయ్య, రైతులు వెంకటేశం, మల్లేశం, సుదర్శన్, రాజు, ప్రవీణ్, శ్రీశైలం, నర్సింహ, ముత్తయ్య పాల్గొన్నారు.

అమ్మ పేరు మీద మొక్కలు నాటాలి : మండల ప్రత్యేకాధికారి

ఆత్మకూరు(ఎం) మొక్క నాటుతున్న మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీఓ రాములునాయక్

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 18 : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రతి ఒక్కరూ అమ్మ పేరు మీద మొక్కలు నాటి సంరక్షించాలని మండల ప్రత్యేకాధికారి రాజారాం, ఎంపీడీఓ రాములునాయక్ అన్నారు. మండల కేంద్రంలోని క్రీడా ప్రాంగణంలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సామాజిక బాధ్యతగా ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆనంద్‌కుమార్, ఉపాధి హామీ టీఏ యాదిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణ, గ్రామ పంచాయతీ సిబ్బంది సుదర్శన్, గోవర్ధన్‌రెడ్డి, బాలరాజు, హరిబాబు, సిమ్మయ్య పాల్గొన్నారు.

వీఓఏపై ఫిర్యాదుపై విచారణ

గుండాల : సుద్దాల గ్రామంలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఏపీఎం అంజయ్య

గుండాల, సెప్టెంబర్ 18 : మండలంలోని సుద్దాల గ్రామ వీఓఏపై మహిళా సంఘం సభ్యులు డీఆర్‌డీఓకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఏపీఎం అంజయ్య గ్రామంలో బుధవారం విచారణ జరిపారు. మహిళా సంఘాలు, సంఘ బంధం సభ్యులతో సమావేశమయ్యారు. వీఓఏ మంజులను మార్చాలని, సంఘం సభ్యులకు లోన్లు వచ్చినప్పుడు ఆమె అదనంగా డబ్బులు తీసుకుంటుందని, అమ్మ ఆదర్శ పాఠశాల పనులను ఇతర కాంట్రాక్టర్లకు ఇచ్చారని మహిళలు తెలిపారు. ఏపీఎం అంజయ్య మాట్లాడుతూ వీఓఏ మంజుల నెలకు రూ.5వేలతోపాటు మూడేండ్లకోసారి వచ్చే స్త్రీనిధి ఇన్సెంటివ్ లక్షా 50వేల రూపాయల నుంచి 50శాతం తీసుకునే వెసులుబాటు ఉన్నదని అన్నారు. నిబంధనలు అనుసరించి నడుచుకోవాలని, తప్పులు జరిగితే చర్యలు తీసుకుంటామని సభ్యులకు తెలిపారు. అనంతరం సంఘం సభ్యుల సమక్షంలో రికార్డులను పరిశీలించి, పొదుపు, అప్పుల వివరాల లెక్కలను సరిచూశారు. వారి వెంట సీసీలు భాస్కర్, కొమురయ్య, బాలనారాయణ, గీత ఉన్నారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీలకు మర్యాల విద్యార్థి ఎంపిక

దీపికకు ప్రశంసాపత్రం అందజేస్తున్న జీహెచ్ఎం నిర్మలజ్యోతి

బొమ్మలరామారం, సెప్టెంబర్ 18 : హైదరాబాద్‌లో ఈ నెల 19, 20 తేదీల్లో జరిగే తెలంగాణ స్టేట్ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలకు మండలంలోని మర్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ధరావత్ దీపిక ఎంపికైనట్లు పాఠశాల జీహెచ్ఎం పగిడిపల్లి నిర్మలజ్యోతి తెలిపారు. ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి సౌత్ జోన్ అథ్లెటిక్ మీట్‌లో 14సంవత్సరాల్లోపు బాలికల అథ్లెటిక్ గ్రూప్ బీ విభాగంలో దీపిక ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైందన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన దీపికకు బుధవారం ప్రశంసా పత్రం, మెడల్ అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీకాంత్, స్వరూపారాణి, సిద్ధులు, రాజు, ముఖిద్, రవీశ్వర్, సుజాత, శ్రీధర్, నాగజ్యోతి, శ్రీదేవి, గోపాల్, సుష్మ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత : ఏసీపీ రమేశ్

రాజాపేట : రఘునాథపురంలో వినాయకుడికి పూజలు చేస్తున్న ఏసీపీ రమేశ్, ఎస్ఐ ఉపేందర్‌యాదవ్

రాజాపేట, సెప్టెంబర్ 18 : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతతతో పాటు స్నేహభావాలు పెంపొందుతాయని యాదగిరిగుట్ట ఏసీపీ రమేశ్ అన్నారు. మండలంలోని రఘునాథపురంలో గ్రీన్ యూత్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపంలో ఎస్ఐ ఉపేందర్‌యాదవ్‌తో కలిసి బుధవారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో వినాయకుడి శోభాయాత్ర నిర్వహించాలన్నారు. అనంతరం ఏసీపీ, ఎస్ఐని గ్రీన్ యూత్ సభ్యులు సన్మానించారు. కార్యక్రమంలో బల్ల యాదేశ్, బల్ల మురళి, బింగి బాలరాజు, బాలరాజు, పాండు, కిరణ్, పవన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు హెల్త్ చెకప్

తిరుమలగిరి అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

బొమ్మలరామారం, సెప్టెంబర్ 18 : మండలంలోని తిరుమలగిరి, మైసిరెడ్డిపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు బుధవారం మైక్రో ప్లాన్ హెల్త్ చెకప్ నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ బరువు, ఎక్కువ బరువు, ఎత్తుకు తగ్గ బరువు లేని పిల్లలను పరీక్షించి వారు నార్మల్ స్థాయికి రావడానికి తీసుకోవాల్సిన చర్యలగురించి వైద్యులు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వైద్య సహాయం అవసరమైన పిల్లలను దవాఖానకు రిఫర్ చేశారు. ఏసీడీపీఓ రమ, సూపర్‌వైజర్ నాగమణి, డాక్టర్ భరత్, అంగన్‌వాడీ టీచర్లు ఉమారాణి, ప్రమీల, ఆశ కార్యకర్త సునీత పాల్గొన్నారు.

ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్

మోత్కూరులో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న పట్టణ వాసులు

మోత్కూరు, సెప్టెంబర్ 18 : వ్యవసాయ భూములకు సంబంధించిన ధరణి పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ ఆదేశించారు. తాసీల్దార్ కార్యాలయంలో బుధవారం ధరణి సేవలను పరిశీలించారు. ఏండ్ల తరబడిగా అపరిష్కృతంగా ఉన్న దరఖాస్తులపై ఫీల్డ్ విజిట్ చేసి పూర్తి వేగంగా పరిష్కరించాలన్నారు. ధరణిపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తాసీల్దార్ ఉపేందర్, ఎంఆర్ఐ సుమన్, ఏఆర్ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెద్ద చెరువులో అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి

మోత్కూరు మున్సిపాలిటీలో ప్రధాన రోడ్డు వెంట ఉన్న పెద్ద చెరువు స్థలాన్ని అక్రమించి ఇండ్ల నిర్మాణం చేపట్టిన వారిపై చర్యలు తీసుకొని ప్రభుత్వ భూమిని కాపాడాలని అదనపు కలెక్టర్‌కు పట్టణ వాసులు విన్నవించారు. పట్టణంలోని 430 సర్వే నెంబర్‌లో అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రంలో ముదిరాజ్ సంఘం నాయకులు బందారి చిరంజీవి, కోమటి జనార్దన్, ఎడ్ల నరేశ్, శ్రీను, పంజాల శ్రీనువాస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఆర్డీఓ

లబ్ధిదారురాలికి చెక్కు అందిస్తున్న ఆర్డీఓ శేఖర్‌రెడ్డి

చౌటుప్పల్, సెప్టెంబర్ 18 : ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీఓ వి.శేఖర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని జయశ్రీ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం మండల వ్యాప్తంగా 47మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబార్ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తాసీల్దార్ ఎస్.హరికృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల శ్రీశైలం, కౌన్సిలర్ బాబా షరీఫ్ పాల్గొన్నారు.

హనుమాపురంలో కుక్కల ఆసుపత్రిని రద్దు చేయాలి

- గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ

కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్య